*తేజ తెలుగు వీక్లీ, అక్టోబర్ 31, 2008*

# రేపటి వెలుగు

**"నా జీవితం, నా యిష్టం!"**

అవునా? అవుననే చెప్పింది రుక్మిణి. ఎండుపుల్లని విరిచినట్లు చెప్పింది - తండ్రి నరసయ్యకి. వెన్నున ఛళ్ళున చరిచినట్లు నిష్కర్షగా చెప్పింది - తల్లి శారదమ్మకి. ఇద్దరికీ కలిపి ఠక్కున మొహాన తలుపు మూసేసినట్లు చెప్పింది.

నరసయ్య మొహం మీద వై మార్కుఏర్పడింది. కోపమో, అణుచుకున్న ఉద్రేకమో తెలీలేదాయనకు.

శారదమ్మ మొహం పాలిపోయింది. ఆవేదనో, అసహాయతో తెలీలేదామెకు.

"మొండిఘటం. చివరికి తాననుకున్నదే తను చేస్తుందేమో. అమ్మ లక్షణా లొచ్చినై దీనికి" అనుకున్నాడు నరసయ్య, భార్యకేసి గుర్రుగా చూస్తూ.

"పెంకితనంలో ఆ అయ్య పోలికే" అనుకుంది శారదమ్మ - భర్తకేసి అవ్యక్త నిరసనని తెలుపుకుంటూ.

'చిన్నా చితకా ఇరవై నాలుగేళ్లొచ్చినై శరీరం మీదికి. పైగా పాతికవేల ఉద్యోగం చేస్తున్న మనిషి. కొట్టే వయసా, తిట్టే పరిస్థితా?' అనుకున్నారు ఇద్దరూ విడివిడిగా, ఎవరికి వారుగా.

ఇదంతా రాత్రి ఇంట్లో జరిగిన భూకంపం తాలూకు ధ్వని.

ముగ్గురూ ఇంట్లో కూచుంటే గడబిడ మొదలవుతుంది- నరసయ్యకీ, శారదమ్మకీ. 'కూతురి పెళ్లి' బాధ్యతగా కంటే, బరువుగానే మారింది. ఆ కారణాన్నే రాత్రి మాట మీద మాటగా అంత గాలివాన!

కొన్ని సంవత్సరాల అనుభవంతో కానీ కొన్ని వాస్తవాలు పూర్తిగా బుర్రకెక్కవు. ఒక యథార్థం నుంచీ దూరంగా వైదొలగాలని ఆశిస్తున్నకొద్దీ, ఆ యథార్థం మరింత సన్నిహితమవుతూ వేధిస్తుంది. ఇప్పుడు నరసయ్యకీ, శారదమ్మకీ ఎదురైన పరిస్థితి అదే.

ఇంజనీరింగ్ పూర్తిచేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరిన ఏడాదిలోపే తన ప్రవర్తనలో వస్తున్న మార్పుని - చెప్పకయే చెప్పినట్లు - తల్లిదండ్రులకిద్దరికీ తెలియజేస్తూనే వుంది రుక్మిణి. శని, ఆదివారాల్లో ఔటింగ్‌లూ, పిక్‌నిక్‌లూ అంటూ వెళ్లటం, ఇంట్లో తిండి తగ్గించి బయటి జంక్‌ఫుడ్‌కి అలవాటుపడటం, అర్థరాత్రి అపరాత్రి టాక్సీల్లో ఇంటికి చేరుకోవటం....

స్వరం తగ్గించి మెల్లగా చెప్పటం, ధ్వని పెంచి గట్టిగా, పెద్దగా చెప్పటం, కోపం చూపీ చూపక రాగాలు తీయటం.... ఇవన్నీ సర్వసాధారణమైపోయాయి, ముగ్గురి సంభాషణల్లోనూ.

వాస్తవానికి ఇంట్లో ఎక్కువ సమయం షష్టాష్టకమే! కినుకలూ, అలకలూ, ఉపవాసాలూ! శారదమ్మేమో గోడవారగా కూచుని పిల్లగొంతుతో తన ఘోషని వెళ్లబోసుకోవటం. "ఆడపిల్లకి అణకువా, ముందుచూపూ ఉండాలమ్మా" అని బుద్ధులు గరపబోతే, రుక్మిణి ముఖం ముడుచుకుని పక్కకి పోయేది.

"అదుపులేని గుర్రాలు అగడ్తలు దాటుతాయయ్యా జాగ్రత్త" అని భర్తనీ అదిలించేది. నిరాశగా నిట్టూర్చేది.

నరసయ్యేమో ఇద్దర్నీ కలిపి ఏమేమో అందామని మొదలెట్టి, కదిలిస్తే ఇల్లంతా కూల్తుందని ఊరుకున్నానన్నట్లు - కూర్చునేవాడు. ఏతావాతా ఇంటి వాతావరణం - పట్టపగలే అర్థరాత్రయినట్టుగా తోచసాగింది.

ఇంతకీ -

పెళ్లి ప్రసక్తి తెచ్చినప్పుడు అందరు ఆడపిల్లల్లా కాకుండా, "మీరు సంబంధం చూసి నాకు చెప్పండి. నా ఆలోచనలు నాకున్నై. వివరాల్ని బట్టి నేనా వ్యక్తితో మాట్లాడతాను" అన్నది రుక్మిణి.

కూతురి మాటలకి తల్లీ తండ్రి విస్తుపోయారు. అస్తిత్వాన్ని దాచుకోవటానికి ఏమో గొణుక్కుని మోకాళ్లల్లో తల ఇరికించుక్కూచున్నారు.

మూడు నాలుగు సంబంధాలు విచారించి చెప్పారు నరసయ్య, శారదమ్మా. సంప్రదాయం, కుటుంబ పరిస్థితులూ, స్థితిగతులూ – చూసే కూతురికి సిఫారసు చేశారు.

రుక్మిణి ఆ అభ్యర్థుల్ని ఇంటర్వ్యూ చేసింది. వాళ్ల ఇళ్లకి వెళ్ళి పరిచయస్థురాల్లా మాట్లాడీ వచ్చింది. కడకు, "నో యూజ్, నాకు నచ్చలేదు. వాళ్ల అభిరుచులకు నా జీర్ణకోశం చెడిపోయింది" అని జోక్ చేసింది.

"ఇంతకీ ఆబ్జక్షన్ ఏమిటి? ఎందుకని నచ్చలేదు?" అంటే "చెప్తా, చెప్తా.... తగిన సమయంలో మీకే తెలుస్తుంది" వంటి సమాధానాలతో నెట్టుకొచ్చేసింది.

ఇదిగో – ఇప్పుడు –

వివాహ వేదికవారి ద్వారా రాజీవ్ గురించి తెలుసుకుని అతని కుటుంబం వివరాలు అవీ చెప్తే–

నెల రోజుల్నుంచీ ఎటూ తేల్చదు, ఏమీ చెప్పదు. నరసయ్యకీ, శారదమ్మకీ ఒళ్ళుమండి గుద్దెర్ర చేస్తే,

"నా జీవితం, నా ఇష్టం" అని ఠక్కున అనేసి, కన్నవారి ప్రాముఖ్యాన్ని నేలమీద వెతుక్కోమన్నట్టు ప్రవర్తిస్తోంది.

రాత్రి తొమ్మిదయింది. బయటినుంచీ చల్లగాలి వీస్తున్నా లోపలి సెగ నరసయ్యనీ, శారదమ్మనీ ఉసురుసురనిపింపచేస్తున్నది.

రుక్మిణి ఇంకా రాలేదు.

ఇద్దరి చూపులూ ముందు గుమ్మంపైనే తారట్లాడుతున్నాయి. "అసలీపిల్ల కోరిక ఏమిటో" "చెప్పి ఛస్తేకదా తెలిసేదీ, ఏమన్నా చెయ్యటానికి వీలయ్యేదీ." ఇద్దరి ధ్వనిలోనూ విసుగు, దుఃఖపు జీరలున్నాయి.

కూతురి మీద నుంచీ ఆడపిల్లల లోకాభిరామాయణం విడివడ్డది.

మోయలేని బరువు పంచుకున్నట్టు మాటలు కలబోసుకున్నారు.

క్షణాల్లో వచ్చింది రుక్మిణి.

వెళ్లి ఫ్రిజ్‌లో నీళ్లు తాగి వచ్చి 'హమ్మయ్య' అని సోఫాలో కూలబడింది. తల్లిదండ్రుల్ని పరీక్షగా చూసింది. తనతో మాట్లాడే ధైర్యం లేనట్లు కూర్చుని వున్నారని గ్రహించింది. వారి జంకుని పోగొడ్తూ అన్నది. "రాజీవ్‌తో నా ప్రపోజల్ చెప్పాను. వాళ్ల ఇంటి పరిస్థితినీ అర్థం చేసుకున్నాను. రేపు తన నిర్ణయం చెప్తానన్నాడు."

ఒక్కక్షణం ఆగి, శారదమ్మ చెదరిన వెంట్రుకల్నీ, తడి కన్నుల్నీ చూస్తూ, నిమ్మళంగా చెప్పింది, "పిచ్చితల్లిలా ఆలోచిస్తూ ఆరోగ్యం చెడగొట్టుకోకు" అని.

శారదమ్మ తడబడింది. భర్తవైపు మొహం తిప్పుకుని, కొంగుతో కళ్ళొత్తుకుంది.

సాత్వికమైన కూతురి మాటలకీ నరసయ్య మనసు కూడా ఆర్ద్రమైంది. ముసలితనంలో తల్లులంతా పిచ్చివాళ్లలా కనిపిస్తారేమో పిల్లలకి అనిపించింది.

శారదమ్మకి ఏవేవో ఆలోచనలు – ముఖపు ముడతల్లో కలిసిన అనుభవాలు ముసిరినై. పదిహేనవయేటనే పెళ్లి. తల్లీదండ్రీ పెళ్లిచూపులన్నారే గానీ, ఆ కాలంలో – తమ కుటుంబాల్లో ఆడపిల్లలు కన్నెత్తి చూసేవారా వరుణ్ణి? అయినా ఆడపిల్లకి అభిప్రాయాలేమిటి? నరసయ్యతో కాపరం. అత్తమామలు, బావగార్లు, తోడికోడళ్లు, ఆడబిడ్డలు అంతా ఉమ్మడి కుటుంబం. పాలేర్లు, పనులు అంతా యాంత్రిక జీవనం. ఉదయం తొమ్మిదింటికి లేస్తే, కాకి తోనే కదా నడుంవాల్చేది. ఎటొచ్చీ – ఆస్తులు హరించుకుపోయి, ఊరూ నాడూ నిప్పచ్చరమైపోయి పట్నం చేరిన తర్వాతేగా, ఒక మాటాపలుకూ! ఈ రుక్కు కడుపున పడిందీ ఆ తర్వాతేగా! ఎవరికెంత విడ్డూరమనిపించినా, వయసు మళ్ళిన తర్వాత నీళ్లోసుకున్న తనని భర్త అపురూపంగా, మురిపెంగానే చూసుకున్నాడు.

కళ్లముందు తిరిగిన పాతకథని పక్కన పెడ్తూ కూతురివైపు చూసింది శారదమ్మ. రుక్మిణి అప్పటికప్పుడే టీ.వి.లో ఏదో సీరియల్ చూడటంలో నిమగ్నమయిపోయింది.

ఫోన్ మోగింది. నరసయ్యే చూశాడు. అవతలివైపు రాజీవ్. రుక్మిణిని ఉద్దేశించి "నీకే" అని పిలిచాడు.

ఆమె వచ్చి "హలో" అంది. శారదమ్మ లేచి వంటింటివైపు నడిచింది. నరసయ్యేమో బాల్కనీలోకి వెళ్ళాడు.

ఆకాశంలో మబ్బులు కలుస్తున్నట్టు కనిపిస్తున్నా, గాలికి తేలిపోతున్నై!

\+ \+ \+

హోటల్లో –

రుక్మిణీ, రాజీవ్!

కాఫీ తాగుతూ, దిక్కులు చూస్తూ మొదలెట్టాడు, రాజీవ్. "మా అమ్మా నాన్నా సాధారణంగా నా ఇష్టాయిష్టాల్ని మన్నించేవాళ్లే. విషయమంతా వివరంగా చెప్పాను."

అతని నుదురు దొంగను పట్టిస్తున్నట్టే అనిపించింది రుక్మిణికి. ఆగింది. నిబ్బరంగా, "ఫర్వాలేదు, చెప్పండి" అంది.

"చూశారుకదా మీరు కూడా. నాకు ముగ్గురూ చెల్లెళ్లే. వాళ్ల పెళ్లిళ్ల గురించే మా వాళ్లందరి భయం. నాకూ బాధ్యత వుంటుంది కదా. మా నాన్న తాను చేసిన చిన్నా చితకా కాంట్రాక్టుల్లో బాగా నష్టపోయి వున్నాడు. అందుకని మావాళ్లు కట్నం బాగానే ఆశిస్తున్నారు, పదిలక్షలదాకా".

రుక్మిణి అతనివైపు చురుగ్గా చూసింది. 'ఈ నెల రోజుల్లో నా మీద వొలకపోసిన ప్రేమ ఇప్పుడు తన గుటకల్లో కూరుకుపోతోంది' అనిపించింది. 'నా విలువ కనుగొన్న మహాశయుడు' అనుకుంది. సన్నగా నవ్వొచ్చింది.

చెమటతో తడిసిన అరచేతుల్ని కర్చీఫ్‌తో తుడుచుకుని మాటలు సాగించాడు రాజీవ్. "కొడుకూ కోడలూ వాళ్లతోనే వుంటే సంసారం ఖర్చు కలిసొస్తుంది. నాలుగురాళ్లు కూడబెట్టుకుని పెళ్లిళ్ల బాధ్యత తీర్చుకోగలిగితే, ఆ తర్వాత విషయం తర్వాత చూసుకోవచ్చు. అంటున్నారు. "వాళ్లు చెప్పేదీ సబబుగానే వుందనిపిస్తోంది."

తలెత్తి అతని కళ్లల్లోకి సూటిగా చూసింది రుక్మిణి. రాజీవ్ చూపులు మరల్చుకున్నాడు.

'జీవితపు కోరికలన్నీ ఒక్క ఆడపిల్లే చెల్లించాలనే స్వార్థం!' అనిపించింది రుక్మిణికి. మాటలో ఎలాంటి ఉద్వేగమూ ద్యోతకం కాకుండా నిబ్బరించుకుని అడిగింది. "సరి. మీ విషయం?"

కనుబొమలు పైకెత్తి, కొద్దిగా తల ఎగరేస్తూ, పక్క టేబుల్ దగ్గరి మనుషుల్ని చూస్తూ సమాధానమిచ్చాడు రాజీవ్, "అది నాకే అసలిష్టం లేదు. ఆ సస్పెన్స్‌నీ, అవస్థనీ నేను భరించలేను. అయినా, హాయిగా ఉన్న ప్రాణాన్ని కరెంట్ తీగ మీద పెట్టే రిస్కెందుకు తీసుకోవాలి?"

ఇప్పుడు రుక్మిణికి ఉక్రోషం ముంచుకొచ్చింది. పెదవులు వణికినై. 'మరి, ప్రేమా దోమా అంటూ నా కలల ఖజానాల్ని దోచుకోవాలనెందుకు ప్రయత్నించావ్?'

అని అడగాలనిపించింది. కానీ, మాటలు గుండె గొంతుకలోనే కొట్టుమిట్టాడాయి.

అమాంతం లేచి వచ్చేసింది.

– ఆ రాత్రి

నరసయ్యకీ, శారదమ్మకీ విషయం తెలిసింది.

తన గదిలోకి వెళ్లటానికి ముందు రుక్మిణి వాళ్లతో ఒక మాట అన్నది. "నేనో నిర్ణయానికొచ్చాను. నే చెప్పేవరకూ నా పెళ్లి గురించి ప్రస్తావించకండి" అని.

వింటున్న ఇద్దరూ విస్తుపోయారు. ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. కొన్ని క్షణాల తర్వాత తెప్పరిల్లుకుని "అదేమిటే" అన్నది శారదమ్మ. నరసయ్య చూస్తున్నాడు, కూతురేం చెప్తుందా అని.

"అవును. నేను సీతా, సావిత్రీ, అనసూయా బాపతేం కాను. జీవితం జీవితమే. నాకు నేనుగా దాన్ని బాష్పబిందువును చేసుకోలేను. నా జీవితం – నా ఇష్టం" అన్నది రుక్మిణి. ఆమె మాటల్లో ఎంతో ఆత్మస్థైర్యం.

"అదిసరే, ఇంతకీ నీ కోరిక...." అని నసిగింది శారదమ్మ.

వేదాంతిలా నవ్వి, తన గదిలోకి వెళ్ళిపోయింది రుక్మిణి. ఈ మగాళ్ల మాయల్ని ఎవ్వరూ గమనించరు. కాలం మారుతోందని అరుస్తారే గానీ, ఆడపిల్ల ఒక్క అడుగు ముందుకు వేసినా భరించలేదీ సమాజం. బరితెగించిన పిల్ల అనే పేరు పెడతారు.

అవునూ – ఇంతకీ తానేం అడిగిందీ? కట్నం ఇచ్చేది లేదన్నది. ఉమ్మడి కుటుంబంలో ఉండటం కుదరదన్నది. ఇక మూడవది – ఎయిడ్స్ టెస్ట్ కావాలన్నది! ఇవన్నీ ఈనాటి సాంఘిక పరిస్థితుల్లో కోరరాని కోర్కెలా? తనలాంటి యువతి ఈ మాత్రం స్వేచ్ఛకీ, హక్కుకీ అర్హురాలు కాదా?!

అయినా, ఇవన్నీ ఆడపిల్లల తల్లిదండ్రులకందరికీ రేపోమాపో తెలిసి తీరాలి. తీరిగ్గా చెప్పాలి. అమ్మకీ నాన్నకీ!

రుక్మిణి ఆలోచన సాగుతోంది.

మంచం మీద వాలింది.

మసక మసగ్గా, మబ్బుమబ్బుగా.. కునుకు... కల!

ఏదో కొత్తలోకం.... దూరంగా.... కాదు, దగ్గరవుతోంది!